అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పాలన

- ఎమ్మెల్యే రక్షణనిధి
- వేమిరెడ్డిపల్లి సచివాలయం పరిధిలో గడప గడపకు మనప్రభుత్వం



సీసీ రోడ్డు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి, పక్కన ప్రజాప్రతినిధులు

వేమిరెడ్డిపల్లి (విస్సన్నపేట): అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ పాలన కొనసాగిస్తుందని ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి అన్నారు. మండలంలోని వేమిరెడ్డిపల్లి సచివాలయం పరిధిలో వేమిరెడ్డిపల్లితండా, సత్తెనగూడెం, గొల్లగూడెం గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి అందించిన సంక్షేమ పథకాల వివరాల బ్రోచర్‌ను ఎమ్మెల్యే గడప గడపకు వెళ్లి అందజేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలకు మించి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు, పేదవిద్యార్థులు ఉన్నత చదువులు చదివేందుకు, రైతన్నల సంక్షేమానికి ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి పార్టీలకు అతీతంగా అమలు చేస్తున్నారన్నారు. గ్రామ వలంటీర్ల ద్వారా సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారుని ఇంటిముంగిటనే అందిస్తున్నామన్నారు. గొల్లగూడెంలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ భీమిరెడ్డి లోకేశ్వర రెడ్డి, ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి, గ్రామ సర్పంచ్ పంతంగి విజయకుమారి, కేడీసీసీబీ డైరెక్టర్ భూక్యా రాణి, ఎంపీటీసీ సభ్యుడు వీ.సత్యనారాయణచారి, సొసైటీ అధ్యక్షుడు ఆర్ సత్యనారాయణ, నెక్కళపు సుబ్బారావు, నెక్కళపు శివయ్య, సొసైటీ మాజీ అధ్యక్షుడు సూరా వెంకట్రామయ్య, వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యుడు ప్రకాష్, మండల బీసీసెల్ అధ్యక్షుడు పంతంగి రమేష్, ఎస్సీసెల్ అధ్యక్షుడు కే తిరుపతిరావు, ఎస్టీ నాయకుడు భూక్యా రాము, ఇన్‌చార్జి ఎంపీడీఓ ఝాన్సీరాణి, మండలంలోని అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



సీఎం సహాయనిధి చెక్కు అందజేస్తున్న ఎంపీపీ లక్ష్మీతిరుపతమ్మ, నాయకులు

జి.కొండూరు: మండల కేంద్రం జి.కొండూరు గ్రామానికి చెందిన చదల దుర్గకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.15 వేలు, పజ్జూరు నాగేశ్వరమ్మకు రూ.55 వేలు సీఎం సహాయ నిధి మంజూరైంది. ఈ నగదు చెక్కులను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ, ఎంపీటీసీ సభ్యుడు కందుల ఏసురాజు, సర్పంచ్ మండల అరుణ చేతుల మీదుగా శనివారం అందజేశారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

రబీలో వరి సాగుకు అనుమతి లేదు

మైలవరం: నాగార్జున సాగర్ కాలువ మూడో జోన్‌కు రబీలో (రెండో పంట) వరి పంట సాగుకు అనుమతి లేదని నాగార్జున సాగర్ ఎడమ కాలువ ఆపరేషన్, మెయిన్‌టెనెన్స్ విభాగం కార్యనిర్వాహక ఇంజినీర్ ఆర్.అప్పారావు శనివారం తెలిపారు. పులిచింతల ప్రాజక్టు సర్కిల్, విస్సన్నపేట సూపరింటెండెంట్ ఇంజినీర్ ఆదేశాలను అనుసరించి డివిజన్ పరిధిలోని సాగర్ జలాలు జోన్ 3 పరిధిలో రెండో పంటగా ఆరుతడి పంటలకు మాత్రమే అనుమతి ఉందన్నారు. రైతులు వారి పరిధిలోని ఆయకట్టు దారులందరికీ రెండో పంటగా వరి సాగు చేయవద్దని ఆయన తెలిపారు. జోన్ 3 పరిధిలో ఆరుతడి పంటల వ్యవసాయానికి, తాగునీటి అవసరాలు మాత్రమే నీటిని వినియోగించాల్సిందిగా కార్యనిర్వాహక ఇంజినీర్ కోరారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

విస్సన్నపేట: మండలంలోని వేమిరెడ్డిపల్లి సచివాలయం పరిధిలో నర్మదానగర్ గ్రామంలో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని ఇన్‌చార్జి ఎంపీడీఓ ఝాన్సీరాణి శనివారం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి పాల్గొంటారన్నారు. సంక్షేమ పథకాలు అమలు గురించి వివరిస్తారని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

నేడు ఆయుర్వేద వైద్య శిబిరం

ఊటుకూరు (గంపలగూడెం): గంపలగూడెం మండలం ఊటుకూరులో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి వాసవీ ఆయుర్వేద ఔషధాల తయారీ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. స్థానిక సిద్ధార్థ విద్యాలయం ఆవరణలో నిర్వహించే ఈ వైద్య శిబిరాన్ని పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

తహసీల్దార్‌కు సీపీఎం నేతల వినతి

మైలవరం: స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శనివారం నాయకులు, కార్యర్తలతో ఆందోళన కార్యక్రమం చేపట్టారు. తమ డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దారు శ్రీనివాస్‌కు అందజేశారు. పేదల ఇంటి జాగా కోసం జానెడు స్థలం ఆక్రమిస్తే వాలిపోయే అధికారులు పేదల భూములు ఆక్రమణ జరిగితే మాత్రం పట్టించుకోరన్నారు. చిన్నా చితక పేదలకు ఉన్న భూములను ఆక్రమణకు గురికావడం దొంగ పత్రాలు సృష్టించి సర్వే నంబర్లు మార్చి పేదల భూములు కాజేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోట కళ్యాణ్, సీపీఎం మండల కార్యదర్శి రావూరి రమేష్, సీఐటీయూ మండల కార్యదర్శి సుధాకర్, భూ పోరాట కమిటీ సభ్యుడు తొమ్మండ్రు యేసు, యోహాను, లాజరు, జానీ తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేల బరుల ధ్వంసం

మైలవరం: సంక్రాంతి పండుగ సందర్భంగా మైలవరం మండలంలో కోడి పందేలకు బరులు సిద్ధం చేసే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ ఎల్.రమేష్ శనివారం తెలిపారు. విజయవాడ సిటీ పోలీస్ కమిషనర్ కాంతిరాణా టాటా, రూరల్ డీసీపీ మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు ఏసీపీ ఎమ్.రమేష్ ఆధ్వర్యంలో సీఐ రమేష్, ఎస్ఐ రాంబాబు మండలంలోని వెల్వడం గ్రామంలోని తోలుకోడు రోడ్డులోని మామిడి తోటలో కోడి పందాలకు సిద్ధం చేసిన బరులను శనివారం ట్రాక్టర్ డ్రోజర్‌లతో ధ్వంసం చేశారు. కోడి పందేలు వేయడానికి తోట, స్థలం ఇస్తే వాటి యజమానులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని సీఐ రమేష్ తెలిపారు. మైలవరం తహసీల్దారు శ్రీనివాసరావు మాట్లాడుతూ మైలవరం మండలం పరిధిలోని గ్రామాల్లో కోడి పందేలు నిర్వహించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలోని గ్రామాల్లో ఆయా గ్రామాల వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, పశు వైద్యశాలల సిబ్బంది, పోలీస్ సిబ్బందితో కమిటీలు ఏర్పాటు చేశామని, వారి పర్యవేక్షణలో కోడి పందాలు జరుగకుండా చూస్తారని తహసీల్దారు శ్రీనివాసరావు తెలిపారు.

మత్తు పదార్థాలతో అనర్థాలపై అవగాహన



మాట్లాడుతున్న సీఐ గిరిజ సత్యకుమారి

రెడ్డిగూడెం: మత్తు, మాదక ద్రవ్యాలను అరికట్టేందుకు యువత సహకరించాలని మైలవరం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ పి.గిరిజ సత్యకుమారి అన్నారు. మండలంలోని రంగాపురం కస్తూర్బా గాంధీ పాఠశాలలో మత్తు, మాదక ద్రవ్యాలను అరికట్టేందుకు విద్యార్థులకు అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు లోను కాకుండా చదువుపై ప్రత్యేక దృష్టి పెట్టి మంచి భవిష్యత్తుకు పునాది వేసుకోవాలన్నారు. మత్తు పదార్థాలకు బానిసైతే జీవితం అస్తవ్యస్తమవుతుందన్నారు. ఎస్‌వో శ్యామల, విద్యార్థినులు పాల్గొన్నారు.

తిరువూరు: మత్తు పదార్థాల వినియోగానికి దూరంగా ఉంటామని తిరువూరు శ్రీనిధి స్కూలు విద్యార్థులు శనివారం ప్రతిజ్ఞ చేశారు. తిరువూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆధ్వర్యంలో పాఠశాలలో మత్తు పదార్థాల వినియోగంతో అనర్థాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఈ మేరకు ఎస్ఈబీ సీఐ గురవయ్య విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. గంజాయి, హెరాయిన్, బ్రౌన్ షుగర్ వంటి మత్తు పదార్థాలను స్వీకరిస్తే కలిగే నష్టాలను వివరించారు. పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో శ్రీకృష్ణుడు



గంపలగూడెం రామాలయంలో సింహాసనంపై శ్రీకృష్ణుడు

గంపలగూడెం: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా గంపలగూడెం సీతారామచంద్రస్వామి ఆలయం, భజన మందిరాల్లో శనివారం సింహాసన పాట్ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ముందుగా మహిళలు 22వ రోజు తిరుప్పావై పఠనం చేశారు. శ్రీకృష్ణుని సింహాసనంపై కూర్చోబెట్టే కార్యక్రమం ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణుని విగ్రహాన్ని నూతన వస్త్రాలు ఆభరణాలతో విశేషంగా అలంకరించారు. సింహాసనాన్ని వివిధ రకాల పూలతో అలంకరించారు. రామాలయంలో సీతారామ, లక్ష్మణ, ఆంజనేయస్వామి మూల విరాట్ దేవతామూర్తులకు వివిధ రకాల ఫలాలతో విశేషంగా ఆలంకరించారు. ఫలాలను హెచ్చా నరేంద్ర, సుధారాణి దంపతులు, పూలు, పూల దండలను కుందా ప్రసాద్, ఉషారాణి దంపతులు అందజేశారు. వైస్‌చైర్మన్ కోదండరామ్ భక్తులు పాల్గొని ప్రత్యేక అలంకరణలో స్వామిని దర్శించుకొన్నారు.

ఏపీ జెన్‌కో శిక్షణా కేంద్రం చీఫ్ ఇంజనీర్ బదిలీ

ఇబ్రహీంపట్నం: ఏపీ జెన్‌కో ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ చీఫ్ ఇంజినీర్ పి.నవీన్ గౌతమ్ బదిలీ అయ్యారు. ఈ మేరకు ఏపీ పవర్ జనరేషన్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ బి.శ్రీధర్ శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. విజయవాడ విద్యుత్ సౌధా కమర్షియల్ చీఫ్ ఇంజినీర్‌గా బదిలీ చేశారు. ఆయన స్థానంలో ఆర్టీపీపీ ఎస్ఈగా ఉన్న నరశింహారావును ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ చీఫ్ ఇంజినీర్‌గా నియమించారు. ఇప్పటి వరకు సీఈ నవీన్ గౌతమ్ ఐదో దశ నిర్మాణ పనులు చేపట్టారు. వాటిని ఎన్టీటీపీఎస్ సీఈ అశోక్ కుమార్‌రెడ్డికి అదనపు బాధ్యతలు అప్పగించారు. విద్యుత్ సౌధాలో కమర్షియల్ సీఈగా ఉన్న పద్మసుజాతను థర్మల్ ప్రాజెక్ట్ చీఫ్ ఇంజినీర్‌గా బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయా స్థానాల్లో వారు బాధ్యతలు స్వీకరించనున్నారు.

కబడ్డీ పోటీల విజేతలకు బహుమతి అందజేత



బహుమతి స్వీకరిస్తున్న డీఏఆర్ జట్టు

తిరువూరు: స్థానిక శ్రీ వాహినీ ఇంజినీరింగ్ కళాశాలలో మూడు రోజుల పాటు నిర్వహించిన ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల స్థాయి కబడ్డీ పోటీల్లో నూజివీడు ధర్మా అప్పారావు కళాశాల జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. శనివారం కళాశాలలో జరిగిన బహుమతి ప్రధానోత్సవంలో చైర్మన్ పసుమర్తి వెంకటేశ్వరరావు విజేతలకు బహుమతులందజేశారు. మొత్తం 20 జట్లు ఈ పోటీల్లో పాల్గొనగా, ఫైనల్స్‌లో నూజివీడు డీఏఆర్ కళాశాల, మైలవరం లక్కిరెడ్డి హనిమిరెడ్డి కళాశాలల విద్యార్థులు తలపడ్డాయి. కళాశాల ప్రిన్సిపాల్ నాగేంద్రబాబు, కోశాధికారి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

జూదాలను కఠినంగా నియంత్రించండి

తిరువూరు ఆర్డీఓ ప్రసన్నలత ఆదేశం



తిరువూరులో మాట్లాడుతున్న ఆర్డీఓ ప్రసన్నలత

తిరువూరు: సంక్రాంతి పండుగ పేరుతో జూదాలు నిర్వహించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ కోడిపందాల వంటి జూదాలు జరగకుండా చూడాలని తిరువూరు ఆర్డీఓ ప్రసన్నలత ఆదేశించారు. శనివారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో డివిజన్లోని మండల రెవెన్యూ అధికారులు, ఎంపీడీవోలు, పోలీసు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. జూదాల నియంత్రణకు తీసుకోవలసిన చర్యలపై ఆర్డీఓ సమీక్షించారు. గ్రామాల్లో జూదాలు జరుగుతున్నట్లు ఎవరైనా సమాచారం ఇస్తే వెంటనే దాడి చేయాలని, నిందితులపై కేసులు నమోదు చేయాలన్నారు. పోలీసులు అన్ని గ్రామాల్లో గట్టి బందోబస్తు కల్పించాలని, జూదాలపై నిఘా ఉంచాలని సూచించారు. ఏసీపీ రమేష్, తిరువూరు సీఐ భీమరాజు, ఎస్ఐలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

శాంతిభద్రతలపై అప్రమత్తంగా ఉండాలి

డీసీపీ శ్రీనివాసరావు



మాట్లాడుతున్న డీసీపీ కె.శ్రీనివాసరావు, సీఐ పి.శ్రీను

ఇబ్రహీంపట్నం: పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణపై అప్రమత్తంగా ఉండాలని డీసీపీ కంచి శ్రీనివాసరావు ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా వాహనాల రద్దీ సమయంలో ట్రాఫిక్ జామ్ లేకుండా చూడాలన్నారు. జాతీయ రహదారుల అభివృద్ధి అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. పండగ వేళ అనేక ప్రాంతాల నుంచి హైవేపై రాకపోకలు జరుగుతాయని ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. సచివాలయం మహిళా పోలీస్‌లు ఆయా గ్రామాల్లో ట్రాఫిక్, శాంతిభద్రతల పరిస్థితి ఎప్పటికప్పుడు గమనిస్తూ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. గ్రామాల్లో శాంతిభద్రతల నివారణ చర్యలు వివరించారు. సమావేశంలో సీఐ పి.శ్రీను, ఎస్ఐ పాపారావు, సచివాలయ మహిళా పోలీస్‌లు పాల్గొన్నారు.

డిగ్రీ కాలేజీలో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు



ఫ్రెషర్స్‌డేలో విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమం

మైలవరం: విద్యార్థి దశ నుంచే తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని వైస్ ప్రిన్సిపాల్ పీ.రంగారావు తెలిపారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరంలో చేరిన విద్యార్థులకు ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులు శనివారం ఘనంగా ఫ్రెషర్స్ డే నిర్వహించి, స్వాగతం పలికారు. కళాశాల ఒక కుటుంబం వంటిదన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ, ఉన్నత విలువలతో జూనియర్, సీనియర్ అనే భేదం లేకుండా ఉండాలన్నారు. ర్యాగింగ్ మంచి పద్ధతి కాదని, మాటలతో, చేతలతో ఇతరులను బాధపెట్టే అధికారం ఎవరికీ లేదన్నారు. కామర్స్ విభాగాధిపతి శ్రీనివాసరావు మాట్లాడుతూ అన్నింటిలో విద్యార్థులు ముందుండాలన్నారు. కల్చరల్ విభాగం కో ఆర్డినేటర్ డాక్టర్ దేవానందకుమార్ మాట్లాడుతూ తల్లిదండ్రులు ఆశయాలకు అనుగుణంగా బాగా కష్టపడి చదవాలన్నారు. అధ్యాపకులు డాక్టర్ షేక్ కరిముల్లా, డాక్టర్ జే. రాముడు, బి.సుభాషిణీ, హరిబాబు, మేజర్ మన్నే స్వామి, నారాయణ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

కార్మికుల క్యాలెండర్ ఆవిష్కరణ



న్యూ ఇయర్ క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న సీఈ అశోక్‌కుమార్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్‌లో ఆంధ్రప్రదేశ్ పవర్ ఎంప్లాయీస్ యూనియన్, ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ వర్కర్స్ యూనియన్ల న్యూ ఇయర్ క్యాలెండర్లను యూనియన్ నాయకుల మధ్య ఎన్టీటీపీఎస్ చీఫ్ ఇంజినీర్ అశోక్‌కుమార్‌రెడ్డి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు, ఉద్యోగులు, సమన్వయంతో సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కార్మికులు మంచి ఆరోగ్యంతో ఉండాలన్నారు. యూనియన్ నాయకులు మోదుగ మోహనరావు, పాల ప్రసాదరావు కోటేశ్వరరావు, రవీంద్రకుమార్ కాంట్రాక్ట్ కార్మికుల క్రమబద్ధీకరణకు కృషి చేయాలని కోరారు.

ఇన్‌స్పైర్ అవార్డుకు ఎంపిక



ఇన్‌స్పైర్ అవార్డుకు ఎంపికైన సిరివెన్నెల

నూజివీడు: పట్టణంలోని బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని బూసరి సిరివెన్నెల ఈ ఏడాది ఇన్‌స్పైర్ అవార్డుకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఆర్ శ్రీలక్ష్మి తెలిపారు. ఈమె భౌతికశాస్త్రంలో పేదవాడి ఎయిర్‌కూలర్ అనే ప్రాజెక్టును రూపొందించి ప్రదర్శించింది. ఎండ నుంచి సామాన్యుడు ఉపశమనం పొందేందుకు తక్కువ ఖర్చుతో వట్టివేర్లు, ఐస్‌ను ఉపయోగించి ఈ కూలర్‌ను తయారు చేసింది. దీంతో సిరివెన్నెల ఇన్‌స్పైర్ అవార్డుకు ఎంపికైంది. ఆమెను, ప్రోత్సహించిన భౌతికశాస్త్ర ఉపాధ్యాయిని మురుదొడ్డి పద్మలతను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

క్రికెట్ క్రీడాకారులకు అభినందన



క్రికెట్‌లో ప్రతిభ చాటిన కీర్తి, లక్ష్మీఅపర్ణలను అభినందిస్తున్న సీఈ అశోక్‌కుమార్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: రాష్ట్ర స్థాయి అండర్ 15 మహిళా క్రికెట్ పోటీల్లో ప్రతిభ చాటిన కోడూరు కీర్తి, పోపూరి లక్ష్మీ అపర్ణలను ఎన్టీటీపీఎస్ చీఫ్ ఇంజినీర్ అశోక్ కుమార్ రెడ్డి శనివారం అభినందించారు. చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో రెండు రోజులు క్రితం జరిగిన పోటీల్లో విజేతలుగా నిలిచి ప్రతిభ చాటారు. విద్యుత్ ఉద్యోగుల బిడ్డలుగా క్రికెట్‌లో రాణించడం సంస్థకు గర్వకారణం అన్నారు. సంస్థ క్రికెట్ గ్రౌండ్‌ను ఉపయోగించుకుని మరింత ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. బాలికల తండ్రులు తిరుమలరావు, హరిబాబు కోచ్ కేకే.ప్రసాద్‌లను అభినందించారు. ఎస్ఈ సురేష్‌బాబు, నల్లమోతు ప్రసన్నబోస్ పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు ప్రారంభించాలి

- ఏలూరు జిల్లా హౌసింగ్ పీడీ వేణుగోపాల్
- గృహ నిర్మాణాల్లో నూజివీడు వెనకబడి ఉందన్న సబ్ కలెక్టర్ రాజేంద్రన్
- నిర్మాణాల్లో పురోగతి చూపాలని ఆదేశం



సమీక్ష నిర్వహిస్తున్న హౌసింగ్ పీడీ వేణుగోపాల్, సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

నూజివీడు: జగనన్న కాలనీల్లోని లబ్ధిదారులందరూ తప్పనిసరిగా గృహ నిర్మాణాలను ప్రారంభించాలని, గృహాలను నిర్మించుకోవడానికి ఆసక్తి చూపని లబ్ధిదారుల నివేశన స్థల పట్టాను రద్దు చేస్తామని ఏలూరు జిల్లా హౌసింగ్ పీడీ టీ.వేణుగోపాల్ హెచ్చరించారు. స్థానిక సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్‌తో కలిసి శనివారం నూజివీడు పట్టణంలోని జగనన్న కాలనీల్లో గృహాల నిర్మాణంపై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సిమెంట్, ఇనుము సిద్ధంగా ఉందని, ఇసుక ఉచితంగా ఇస్తున్నామని, స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులకు రూ.35 వేల రుణం అందిస్తున్నామని, అయినా గృహాల నిర్మాణాల్లో వెనుకబడి ఉండటం దారుణమన్నారు. రాబోయే రోజుల్లో లబ్ధిదారులకు చెప్పాల్సిన పనిలేదని, అధికారులే కాంట్రాక్టర్‌కు గృహ నిర్మాణాలను అప్పగించి నిర్మాణ పనులు ప్రారంభించేటప్పుడు లబ్ధిదారులకు తెలియజేయాలన్నారు. ఆర్పీలు, సచివాలయ ఎమినిటీ సెక్రటరీలు లబ్ధిదారులను చైతన్యపరిచి గృహాలను నిర్మించుకునేలా చూడాలన్నారు. సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇళ్లు లేని పేదలందరికీ ఇళ్ల స్థలాలను అందజేసి, పక్కా గృహాలను మంజూరు చేసిందని, ఒక్కొక్క ఇంటికి రూ.1.80 లక్షలను చెల్లిస్తోందన్నారు. అయినప్పటికీ లబ్ధిదారులు గృహాల నిర్మాణాలకు ముందుకు రాకపోవడం దారుణమన్నారు. లబ్ధిదారులు నిర్మించుకోవడానికి స్థోమత లేకపోతే కాంట్రాక్టర్‌తోనే నిర్మాణ పనులు చేయిస్తామన్నారు. జిల్లాలో గృహాల నిర్మాణంలో నూజివీడు వెనుకబడి ఉందని, దీనిని ముందుకు తీసుకెళ్లేందుకు అధికారులు, సిబ్బంది అందరూ బాధ్యతగా కృషి చేయాలన్నారు. గృహాల నిర్మాణంపై వారానికి ఒకసారి సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ప్రతి వారం నిర్మాణాల్లో పురోగతి కనిపించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో నూజివీడు మున్సిపల్ డీఈ దాస్యం లక్ష్మీనారాయణ, హౌసింగ్ ఏఈ వెంకటేశ్వరరావు, మెప్మా అధికారి ఆనంద్, ఆర్పీలు, సచివాలయ ఎమినిటీ సెక్రటరీలు, హౌసింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో ఆకస్మిక తనిఖీ



అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ

ముసునూరు: గర్భిణులు, బాలింతలు, చిన్నారులంతా అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ జి.రాణి అన్నారు. మండలంలోని అక్కిరెడ్డిగూడెం ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పిల్లల హాజరు శాతాన్ని పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాలల్లోని మధ్యాహ్న భోజన పథకం దుర్వినియోగాన్ని సహించబోమని హెచ్చరించారు. మెనూ ప్రకారమే మధ్యాహ్న భోజనాన్ని రుచిగా శుచిగా తయారు చేసి చిన్నారులకు అందించాలన్నారు. ఎంపీడీఓ కార్యాలయ పర్యవేక్షకుడు సాయిరాము, సీఆర్పీ, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యం



విద్యార్థినులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు

మైలవరం: యోగాతో ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని ప్రిన్సిపాల్ డాక్టర్ కే.అప్పారావు తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఐసీసీ, సహేలీ గరల్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు 15 రోజులు ప్రత్యేక యోగా శిక్షణ తరగతులు నిర్వహించారు. శనివారం ముగింపు కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు మాట్లాడుతూ యోగా ధ్యానం శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. యోగా మాస్టర్ జే.డీ.వీ ప్రసాద్ విద్యార్థినులకు ఉపయోగపడే ఆసనాలు, ప్రయోజనాలు వివరించారు. కార్యక్రమంలో 31 మంది విద్యార్థినులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఐసీసీ ఇంచార్జి ప్రిసైడింగ్ ఆఫీసర్ డాక్టర్ పీ.శోభారాణి, కే.రాణిరుద్రమ, సహేలీ మెంటార్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్, సహేలీ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నూజివీడు: పట్టణంలోని 33/11కేవీ విద్యుత్ ఉప కేంద్రం, ట్రిపుల్ ఐటీలోని విద్యుత్ ఉప కేంద్రాల్లో మరమ్మతుల దృష్ట్యా ఆదివారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ టౌన్ డీఈ ఓలేటి దుర్గారావు శనివారం తెలిపారు. హనుమాన్ జంక్షన్ రోడ్డు, అమ్మవారితోట, బ్యాంక్ స్ట్రీట్, రామాయమ్మరావు పేట, ఆటోనగర్, ఎంప్లాయీస్ కాలనీ, తుక్కులూరు, జంగంగూడెం, శ్రీనివాసా సెంటర్, గాంధీనగర్, ధండంగార్డెన్స్, అజరయ్యపేట, కుమ్మరిపేట, ఏరియా ఆసుపత్రి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

రేపటి నుంచి ఆటల పోటీలు

ముసునూరు: సంక్రాంతి సందర్భంగా గ్రామీణ క్రీడలను ప్రోత్సహించాలని ఎస్ఐ ఎం.కుటుంబరావు పిలుపునిచ్చారు. స్థానిక పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 9, 10 వ తేదీల్లో మండల స్థాయి వాలీబాల్ పోటీలను ముసునూరులో నిర్వహించనున్నట్లు శనివారం చెప్పారు. రెండు రోజులపాటు సాగనున్న పోటీల్లో విజేతలకు నేతలు, క్రీడా ప్రోత్సాహకుల సౌజన్యంతో నగదు బహుమతులను ఇస్తామన్నారు. విజేతలను డివిజన్ స్థాయి పోటీలకు నూజివీడు పంపనున్నట్లు తెలిపారు. సంక్రాంతి పండుగ పేరుతో, సంప్రదాయం ముసుగులో కోడిపందేలు వేసి మూగజీవాలతో ఆటలాడరాదని, జూదాలకు పాల్పడి ఆర్థికంగా నష్టపోవద్దని ప్రజలకు సూచించారు. సంక్రాంతి పండుగను ఆనందంగా జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో క్రీడాకారులు, క్రీడాభిమానులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సదస్సు జయప్రదానికి వినతి

మైలవరం: వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సదస్సు ఈ నెల 9న విజయవాడలో జరుగుతుందని, ఈ సదస్సును జయప్రదం చేయాలని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కే.కళ్యాణ్ తెలిపారు. మైలవరం సీపీఎం కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో కళ్యాణ్ మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక, మతోన్మాద బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా కార్మిక, కర్షకుల రాష్ట్ర హక్కుల సాధన కోసం సదస్సు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి సీహెచ్ సుధాకర్, రైతు సంఘం మండల కార్యదర్శి వీ.వెంకట రెడ్డి, జి.కొండూరు సీఐటీయూ మండల కార్యదర్శి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రేపు బహిరంగ వేలం

ముసునూరు: చారిత్రక ప్రసిద్ధ శైవ క్షేత్రం బలివేలో మహాశివరాత్రి సందర్భంగా ఫిబ్రవరి 17 నుంచి 19 వరకు జరగనున్న బలే రామలింగేశ్వరస్వామి ఉత్సవాల్లో తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేసుకోవడానికి సోమవారం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ టి.విశ్వేశ్వరరావు తెలిపారు. దేవదాయశాఖ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు జరుగనున్న మహోత్సవాలకు ఉత్సవ ప్రాంగణంలో వ్యాపారాలు నిర్వహించేందుకు తాత్కాలిక దుకాణ సముదాయాల ఏర్పాటు, కొబ్బరి చిప్పల సేకరణకు ఈవేలం నిర్వహిస్తామన్నారు. ఆసక్తిగల వారు దుకాణ స్థలాల కోసం రూ.50 వేలు, కొబ్బరి చిప్పల సేకరణదారులు రూ.20 వేలు డిపాజిట్ చెల్లించి, సకాలంలో హాజరు కావాలని కోరారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి

చాట్రాయి: ప్రభుత్వం మంజూరు చేసిన స్థలాల్లో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీవో ఎస్ మురళీమోహనరావు అన్నారు. శనివారం చాట్రాయి గ్రామంలో నిర్వహించిన హౌసింగ్ డేలో ఆయన మాట్లాడారు. మంజూరైన గృహాలకు బిల్లులు త్వరితగతిన చెల్లిస్తున్నందున గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విశ్వనాథరావు, వైఎస్సార్ సీపీ నాయకులు దామెర ప్రసాదుబాబు, ఈవోపీఆర్డీ నాగరాజు, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి పాల్గొన్నారు.